క్లుప్తంగా

వేణుగోపాలస్వామికి పూలంగి సేవ



ప్రత్యేకాలంకరణలో వేణుగోపాలస్వామి

బలిజిపేట: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా మండలంలోని చిలకలపల్లి గ్రామంలో ఉన్న వేణుగోపాలస్వామి ఆలయంలోని స్వామి వారికి శనివారం పూలంగి సేవ నిర్వహించారు. ఆలయ ధర్మకర్త, అర్చకులు కె.రాంబాబు ఆధ్వర్యంలో స్వామి వారిని వివిధ పూలతో ప్రత్యేకంగా అలంకరించి, ఉత్సవ విగ్రహాన్ని వీధుల్లో ఊరేగించారు. భక్తులంతా స్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు.

అభివృద్ధి పనులకు ఆమోదం

సాలూరు: మండలంలోని మామిడిపల్లి గ్రామంలో సర్పంచ్ సువ్వాడ శశికళ అధ్యక్షతన శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించి, పలు పనులకు సభ్యులు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆకుల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ పరిశీలన



అగ్రి టెస్టింగ్ ల్యాబ్ పరిశీలిస్తున్న అగ్రికల్చర్ డీడీ అప్పలస్వామి

సాలూరు: పట్టణంలోని వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను అగ్రికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ అప్పలస్వామి శనివారం పరిశీలించారు. ల్యాబ్‌కు ఇప్పటివరకు వచ్చిన పరికరాలు, ఇంకా రావాల్సిన పరికరాలపై ఆరాతీశారు. అనంతరం స్థానిక వ్యవసాయ పరిస్థితులు, ప్రధానంగా సాగు చేసే పంటల వివరాలను ఏడీఏ మధుసూదనరావును అడిగి తెలుసుకున్నారు.

ఎఫ్ఐపీవీ వ్యాక్సినేషన్‌పై శిక్షణ



వ్యాక్సినేషన్ శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఐఓ జగన్‌మోహన్‌రావు

పార్వతీపురం టౌన్: జిల్లా ఆస్పత్రిలో ఎఫ్ఐపీవీ వ్యాక్సినేషన్‌పై ఇస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి(డీఐఓ) టి.జగన్మోహన్‌రావు శనివారం పరిశీలించారు అనంతరం ఆయన మాట్లాడుతూ ఎఫ్ఐపీవీ మూడో డోస్ టీకా అర్హుల జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. 9 నెలలు నిండిన పిల్లలకు షెడ్యూల్ ప్రకారం టీకా వేయాల్సి ఉంటుందన్నారు. పోలియో నిర్మూలనలో భాగంగా ప్రస్తుతం ఆరు వారాలు, పద్నాలుగు వారాల వయసు పిల్లలకు టీకాలు వేస్తున్నామన్నారు. అనంతరం ఎంఆర్‌సీ కేంద్రాన్ని సందర్శించిన ఆయన పిల్లల ఆరోగ్యం పరిశీలించి, ఆరోగ్య నివేదిక రికార్డులను తనిఖీ చేశారు.

మృతుని కుటుంబానికి తక్షణసాయం అందజేత

పార్వతీపురం: మండలంలోని కొత్తవలస గ్రామానికి చెందిన కోలక సూరయ్య ఇటీవల మృతి చెందారు. ఈ మేరకు ఆయన భార్య కోలక నల్లమ్మకు వైఎస్సార్ బీమా పథకం కింద రూ.10 వేల తక్షణసాయం శనివారం అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు స్థల పరిశీలన



అంగన్‌వాడీ భవనాలకు స్థలం పరిశీలిస్తున్న ఉపవిద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు

మక్కువ: మండలంలోని మేళాపువలస, మక్కువ, ఎస్.పెద్దవలస, కవిరిపల్లి గ్రామాల్లో కొత్తగా నిర్మించనున్న అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు పార్వతీపురం మన్యం జిల్లా ఉప విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు శనివారం స్థలం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కొత్త అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందన్నారు.

సంక్షేమ పథకాలతో గౌరవం..

• డిప్యూటీ సీఎం రాజన్నదొర



లబ్ధిదారులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

మెంటాడ: ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల ప్రజాప్రతినిధులకు గౌరవం లభిస్తోందని డిప్యూటీ సీఎం, గిరిజన శాఖా మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని నూతన పంచాయతీ చింతాడవలసలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు డిప్యూటీ సీఎం రాజన్నదొరకు ఘన స్వాగతం పలికారు. అనంతరం రాజన్నదొర, తదితరులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నదీ, లేనిదీ ఆరా తీశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, సంక్షేమ పథకాలతో ఆర్థికంగా నిలదొక్కుకున్నట్లు ప్రజలు చెబుతుంటే ఆనందంగా ఉందన్నారు. ప్రజా సమస్యలతో పాటు పాలనపై ప్రజాభిప్రాయం తెలుసుకోవడానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన అమలవుతుంటే, ఓర్వలేకే ప్రతిపక్షాలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయన్నారు. చంద్రబాబు సభల్లో ప్రజలు మృత్యువాత పడుతుంటే దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్ కనీసం పరామర్శించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీలు సారిక ఈశ్వరరావు, పొట్టంగి దుర్గ, స్థానిక సర్పంచ్ గేదెల అన్నపూర్ణ, నాయకులు సతీష్, ప్రకాష్, పైడితల్లి, లెంక రత్నాకర్, రెడ్డి రాజప్పలనాయుడు, చొక్కాకు సన్యాసినాయుడు, శిరిపురపు నాగమణి, ఎంపీడీఓ త్రివిక్రమ్, తహసీల్దార్ ఆదిబాబు, ఏపీఓ, ఏపీఎంలతో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న వెలుగు ఏపీఎం సింహాచలం

సాలూరు: క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించి, జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని వెలుగు ఏపీఎం సింహాచలం విద్యార్థులకు సూచించారు. మండలంలోని శివరాంపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో కిశోరి బాలికలు(10 నుంచి 19 సంవత్సరాల లోపు వయసు వారు)కు వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారంపై శనివారం అవగాహన కల్పించారు. ఈ దశ చాలా కీలకమైందని, ఈ దశలో అన్ని విషయాల్లో చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ఆరోగ్యపరంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతిరోజూ తినే ఆహారంలో పౌష్టికాహారం ఉండేలా చూసుకోవాలన్నారు. పౌష్టికాహారం తినడం ద్వారా మంచి ఆరోగ్యం సంపాదించడంతో పాటు రక్తహీనత బారినపడకుండా ఉండొచ్చన్నారు. కార్యక్రమంలో సీసీలు మోహనరావు, అనీల్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలు, పెన్నుల వితరణ



విద్యార్థులకు తినుబండారాలు అందిస్తున్న దాతలు సింహాచలం, రామ్మోహనరావు

సీతానగరం: మండలంలోని లచ్చయ్యపేట ఎయిమ్ ఫర్ సేవా ఛాత్రాలయ విద్యార్థులకు ఎన్‌ఆర్ఐ రౌతు సింహాచలం, రామ్మోహనరావు దంపతులు శనివారం పుస్తకాలు, పెన్నులు, తినుబండారాలను వితరణ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ లచ్చయ్యపేటలో సొంత నిధులతో ఆశ్రమం నిర్మించి, విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించేందుకు తమవంతు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఛాత్రాలయ కమిటీ ప్రతినిధులు కొత్తా రవి, సాలా అశోక్, పుల్లెల శ్రీనివాసరావు, గోనా ప్రసాద్, ఛాత్రాలయ మేనేజరు సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

కొత్తవలస కూడలిలో 'నో యాక్సిడెంట్ డే'



వాహనదారులకు సూచనలిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు

పార్వతీపురం టౌన్: పట్టణంలోని కొత్తవలస కూడలిలో నో యాక్సిడెంట్ డే కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలు, పాటించాల్సిన నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. వాహనదారులు రోడ్డు ప్రమాదాలకు కారణం కాకుండా, ప్రమాదాలకు గురికాకుండా ఉండాలని కోరారు. ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఫోర్ వీలర్ కలిగిన వారంతా వాహనాలతో వచ్చేటప్పుడు సీటు బెల్ట్ పెట్టుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనం నడపరాదని, అతివేగం పనికిరాదన్నారు. అలాగే ఆటోల్లో, క్యాబ్‌ల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదన్నారు. కార్యక్రమంలో సిబ్బంది కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు



కాలువల్లోని పూడికలు తీయిస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు

సీతానగరం: మండలంలోని పెదంకలాం గ్రామంలో సర్పంచ్ బి. శ్రీనివాసరావు పర్యవేక్షణలో పారిశుద్ధ్య పనులు చాలా చురుగ్గా కొనసాగుతున్నాయి. శనివారంవీధులు, కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించి, కాలువల్లో పూడికతీతలు చేపట్టారు. దోమల నివారణ మందు కూడా పిచికారీ చేశారు.

20 లీటర్ల సారా పట్టివేత

సీతంపేట: మండ గ్రామానికి చెందిన సవర శ్రీను సారా తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై ఎ.నీలకంఠరావు శనివారం తెలిపారు. అతని వద్ద 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. సారా తయారు చేసినా, తరలించినా, విక్రయించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఇంటర్వ్యూకు 17 మంది హాజరు

సీతంపేట: శ్రీకాకుళం జిల్లాలోని అంగన్‌వాడీ ఉద్యోగాలకు సీతంపేట ఐటీడీఏలో శనివారం ప్రాజెక్టు అధికారి బి.నవ్య ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 12 పోస్టులకు గాను 17 దరఖాస్తులు రాగా 17 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారు. ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయపార్వతి, సీడీపీఓ పి.రంగలక్ష్మి అభ్యర్థుల ధ్రువపత్రాలు పరిశీలించారు.

జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి తనిఖీ



జయశ్రీ ఆస్పత్రిని పరిశీలిస్తున్న జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి జగన్నాథరావు

పార్వతీపురం: పట్టణంలోని జయశ్రీ ఆస్పత్రిని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.జగన్నాథరావు, తనిఖీ బృందం కలిసి శనివారం సందర్శించారు. కొన్నిరోజుల క్రితం ఆస్పత్రి యాజమాన్యం ఏఆర్‌పీ లెవెల్–1 ఫెర్టిలిటి కేంద్రానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా, ఈ మేరకు ఆస్పత్రి పరిసరాలు, మిషనరీ, సిబ్బంది తదితర అంశాలను బృంద సభ్యులు పరిశీలించారు. కార్యక్రమంలో బృంద సభ్యులు పీసీపీఎన్‌డీటీ ప్రోగ్రాం అధికారి టి.జగన్‌మోహన్‌రావు, గైనకాలజిస్టు బి.సాగరిక, రేడియాలజిస్టు రాజేష్ ప్రధాన్, ఎపిడెమియాలజిస్టు ఎం. నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులు దూరం

కురుపాం:

వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని 104 వైద్యాధికారి జి.వెంకటహర్ష అన్నారు. మండలంలోని జి.శివడ గ్రామంలో 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమంలో భాగంగా శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 40 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. శిబిరంలో ఎం.ఎల్.హెచ్ శైలజ, హెల్త్‌అసిస్టెంట్ రామారావు, ఏఎన్ఎం, ఆశావర్కర్లు సేవలందించారు.

అర్హులందరికీ పింఛన్లు



పింఛన్‌ను అందజేస్తున్న సర్పంచ్ ఇందుమతి

గరుగుబిల్లి: అర్హులైనవారికి పింఛన్లు మంజూరు చేయడం జరుగుతుందని గరుగుబిల్లి గ్రామ సర్పంచ్ కె.ఇందుమతి అన్నారు. గ్రామంలో కొత్తగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు వలంటీర్లతో కలిసి శనివారం పింఛన్ డబ్బులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా..అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ పింఛన్లు, సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. టీడీపీ నాయకుల కుటుంబాలకు కూడా పింఛను మంజూరు చేయడమే ఇందుకు నిదర్శమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆర్.రామినాయుడు, ఎన్.శ్రీరాములనాయుడు, సచివాలయ కన్వీనర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు నీలకంఠాపురం విద్యార్థులు

కురుపాం: మండలంలోని నీలకంఠాపురం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం బి.గోవిందరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు చంద్రమోహన్, వసతిగృహ సంక్షేమాధికారి పి.మల్లేష్ తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ పార్వతీపురంలో గత నెల 29న జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు కిల్లక లోకేష్, తిమ్మక దీపక్ అండర్–14 విభాగంలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికై నట్లు చెప్పారు. అలాగే విజయనగరంలో గత నెల 27న జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో పదో తరగతి విద్యార్థి కిల్లక కుమార్‌రాజు అండర్–17 విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వెల్లడించారు. వీరంతా ఈనెల 20 నుంచి శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా పోటీలకు ఎంపికై న విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

నిబంధనలు పాటించాలి

వీరఘట్టం: వాహనదారులు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని ఎస్సై ఎం.హరికృష్ణ సూచించారు. శనివారం స్థానిక కొత్త బస్టాండ్‌లో ఆటోడ్రైవర్లకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. ఆటోల్లో ఎంతో మంది ప్రయాణికులు నిత్యం ప్రయాణం చేస్తుంటారని, వారిని సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చాలని సూచించారు. పరిమిత వేగంతో వాహనాలు నడపాలని, మద్యం తాగి వాహనాలు నడిపినా, లైసెన్స్, సరైన ధ్రువపత్రాలు లేకుండా రాకపోకలు సాగించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఇళ్ల నిర్మాణాలు చేపట్టకపోతే పట్టాలు రద్దు



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమహేష్‌రెడ్డి

సీతానగరం: మండలంలోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారుల పట్టాలు రద్దు చేస్తామని ఎంపీడీఓ బి.కృష్ణమహేష్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని తిమరఖండిలో జగనన్న కాలనీ లే–అవుట్‌ను పరిశీలించిన ఆయన ఇంత వరకు లబ్ధిదారులు ఇళ్లు నిర్మించకపోవడానికి గల కారణాలపై ఆరాతీశారు. ప్రభుత్వం నిర్మాణ సామగ్రి సరఫరా చేయడంతో పాటు రుణాలు మంజూరు చేసినా నిర్మాణాలు చేయకపోవడమేంటని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని, లేకపోతే మీరే నష్టపోతారని లబ్ధిదారులకు తెలిపారు. ఏఈ జానకీరాం మాట్లాడుతూ నిర్మాణాలు ప్రారంభించిన వారికి నిర్మాణ సామగ్రితో పాటు సకాలంలో బిల్లులు కూడా చేయడం జరుగుతోందన్నారు. లబ్ధిదారులంతా నిర్మాణాలు చేపట్టేందుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎం. మన్మథరావు, పీఏసీఎస్ చైర్మన్ వై.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలతో అనర్థాలు



బాల్యవివాహాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బాలామణి

బలిజిపేట: బాల్యవివాహాల వల్ల అనర్థాలు కలుగుతాయని బలిజిపేట సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బాలామణి అన్నారు. మండలంలోని చిలకలపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పౌష్టికాహారం ప్రయోజనాలు, బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 10 నుంచి 19 సంవత్సరాల లోపు వారిని కిశోరి బాలికలు అంటారని, ఈ దశను కౌమార దశ అంటారన్నారు. ఆ సమయంలో బాలికలంతా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. మంచి ఆహారం తీసుకున్న వారు రక్తహీనత బారిన పడకుండా ఉంటారని తెలిపారు. పౌష్టికాహార లోపంతోనే మహిళలు ఎక్కువగా రక్తహీనత బారిన పడి, ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. అలాగే చిన్న వయసులో పెళ్లి చేసుకోవడం ద్వారా ప్రసవ సమయంలో కష్టంగా ఉండడంతో పాటు మరెన్నో అవస్థలు పడాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు, వైద్య శాఖ సిబ్బంది, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

భూముల రీసర్వేకు రైతులు సహకరించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ రమణ

సీతానగరం: భూముల రీసర్వేకు రైతులంతా సహకరించాలని తహసీల్దార్ ఎన్వీ రమణ కోరారు. శనివారం మండలంలోని వెంకటాపురం(కామందొరవలస)లో భూముల రీసర్వే డీటీ చిట్టెమ్మ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించి, భూముల రీసర్వేపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద సంవత్సరాల క్రితం భూముల సర్వే జరిగిందని, ప్రభుత్వం అసలైన రైతులకు భూములు చెందాలనే సదుద్దేశ్యంతోనే భూముల రీసర్వే చేపట్టిందని వివరించారు. ఈ సర్వే ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. ఎన్నో ఏళ్లుగా రైతుల మధ్య నెలకొన్న భూ తగాదాలు పరిష్కారమవుతున్నాయన్నారు. క్షేత్ర స్థాయిలో సర్వే చేపడుతున్న అధికారులు రైతుల సమక్షంలో సర్వే చేయాలని, రైతులు కూడా సర్వేకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో శంకరరావు, సచివాలయ సర్వేయర్ ఎస్. శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు ముకుందరావు, వీఆర్‌ఓ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

• 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని గుచ్చిమి గ్రామంలో శనివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన మూడున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రజల బాగోగుల కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని, ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ఆయన గ్రామాల్లో సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను ఏర్పాటు చేశారని తెలిపారు. వీటి ద్వారా అర్హులైన ప్రతిఒక్కరికీ కుల, మత, రాజకీయ పార్టీల బేధం చూడకుండా పథకాలు అందిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే ప్రజలను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ మర్రాపు శ్రీదేవి, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, ఎంపీటీసీ సీహెచ్ జగదీశ్వరరావు, మండల పార్టీ నాయకులు బొంగు చిట్టిరాజు, ఎం.మన్మథరావు, పీఏసీఎస్ చైర్మన్ పి.సంజీవినాయుడు, వ్యవసాయ సలహా కమిటీ అధ్యక్షుడు పి.ఈశ్వరనారాయణ, అధికారులు జి.సూరిదేముడు, సోమేశ్వరరావు, ఆర్.శ్రీరాములు, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది పనితీరుపై డీఎల్‌డీఓ అసంతృప్తి



సచివాలయం రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ

పాలకొండ: సచివాలయ సిబ్బంది పనితీరు మారాలని డీఎల్‌డీఓ వీవీ గోపాలకృష్ణ అన్నారు. మండలంలోని సింగన్నవలస సచివాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. అక్కడ సిబ్బంది పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ సర్వీసులు కనీసం స్థాయిలో కూడా అందించడం లేదని మండిపడ్డారు. సిబ్బంది క్రమం తప్పకుండా విధులకు హాజరుకావాలని, సమయపాలన పాటించాలని, సిటిజన్ చార్ట్ ప్రకారం ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వ సేవలకు సంబంధించిన బోర్డులు, సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలను ప్రదర్శనగా ఉంచాలన్నారు.

పారదర్శకంగా ఉపాధి పనులు



దోలమడ సచివాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ త్రినాథులు

పాలకొండ రూరల్: మండల పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులను పారదర్శకంగా చేపట్టాలని ఎంపీడీఓ డొంక త్రినాథులు అన్నారు. మండలంలోని నవగాం, పాట్లి, అవలంగి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం పరిశీలించారు. నిబంధనల మేరకు ఆన్‌లైన్ హాజరు కచ్చితంగా అమలు చేయాలన్నారు. వేతనదారులు నిర్దేశిత సమయాల్లో పనులు చేయాలని, సమయపాలన పాటించటం, కొలతల మేరకు పనులు పూర్తి చేయడం ద్వారా గరిష్ఠ వేతనం పొందవచ్చని సూచించారు. అనంతరం డోలమడ సచివాలయాన్ని సందర్శించారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలని సిబ్బందికి సూచించారు.